

63

ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ :** ఓ పల్లెటూరి జానపద గాయని కోసం వెతుక్కుంటూ వచ్చిన జాయపకు.. ఊహించని సంఘటన ఎదురైంది. తను వచ్చే సమయానికి ఆ గాయనిని తన భర్త హింసిస్తుండగా.. కాపాడి తీసుకు పోయింది నీలాంబ కుమార్తె లలితాంబ! అంతే, తెల్లబోయాడు జాయపుడు. మరునాడే నీలాంబ వేశ్యాగృహానికి వెళ్లాడు. ఎప్పుడూ ఈ వేశ్యావాటికను పరిశీలనగా చూడలేదు. ఇప్పుడు కలియజూస్తే అర్థమైంది ఏమిటంటే.. వాటిక ప్రధానద్వారం ఒక్కటే కానీ, కార్యకలాప మందిరాలు వేరు, నివాస మందిరం వేరు.

జాయపుడు రెప్పవేయని కళ్లతో అయోమయంగా కలియ జూస్తున్నాడు.

అప్పుడు మొదటి అంతర్వులో అక్కతోనే ఆమె పర్యంకంపై పక్కనే నిద్రపోయాడు. అక్కడే లలితాంబ కూడా ఉండేది. మరెందరో పిల్లలతో ఓ చిన్న పిల్లల బృందం ఉండేది. బయటికి వచ్చేటప్పుడు ఎవరెవరో వెంట వచ్చి.. పల్లకీ లేదా ఎడ్లబండి లేదా అశ్వంపై తీసుకెళ్లేవారు.. తీసుకువచ్చేవారు. తను ఎప్పుడూ ఒంటరిగా వెళ్లలేదు. రాలేదు. ఇవన్నీ చూస్తుంటే.. 'అసలు ఆమె వేశ్యా సామ్రాజ్యంలోకి.. అంటే అవతలి మందిరాల్లోకి అడుగుపెడితే ఎలా ఉంటాయో? ' అని తలపోస్తుండగా, నీలాంబ ఓ బంగారుపళ్లెరంలో బొబ్బట్లు, బూరెలు, అల్లపు గారెలు తీసుకువచ్చింది.

నవ్వుతూ ఏదో చెబుతూ, ఓ గారెను జాయపుని నోటికి అందించింది. జాయపుడు కూడా అంతే ఆప్యాయతతో నోరుతెరిచి అందుకున్నాడు.

మాతృత్వభావనపు పరవశం ఆమె శరీరమంతా నిండి తొణికిసలాడుతున్నది. ఆమెను చూస్తుంటే జాయపునికి తన తల్లివరుస బంధువులు గుర్తుకువస్తున్నారు. ఇప్పుడామె మగవాని చూపులకు తన తనూలావణ్యాన్ని ఎర వేసే అనుభవజ్ఞురాలైన వేశ్యావాటిక నిర్వాహకురాలిగా లేదు. ఓ తల్లిలా ఉంది. ఓ అక్కలాగా ఉంది. బిడ్డ ఆకలి తీర్చే పక్షిలా ఉంది. కోడెదూడకు పాలిచ్చే గంగిగోవులా ఉంది. అతనితో మాట్లాడుతున్నా.. జాయపుని చూపుల్లో కదలాడుతున్న ప్రశ్నార్థకాలు, ఆశ్చర్యార్థకాలు గుర్తించ లేని అమాయకురాలు కాదు నీలాంబ.

జాయపుడు తినడం పూర్తయ్యాక అన్నది..

''నా వేశ్యావాటిక చూస్తావా?'' అని.

జాయపుడు కంగారుపడ్డాడు. పొలమారింది కూడా! నీటికోర అందించింది. అతని జవాబు కోసం చూడకుండానే లేచి కదిలింది.

''నాతో రా!'' అన్నది.

జాయపుడు ఆమె వెంట కదిలాడు.

చిన్నతోవ గుండా వెళ్తుండగా..

''అప్పట్లో నువ్వు పిల్లవాడివి. ఇక్కడి కార్యకలాపాలు నీకు తెలియదు. అప్పుడు చెప్పినా అర్థంకాదు. ఇప్పుడు అర్థం చేసుకునే వయసుకు వచ్చావు. ఇప్పుడు చెప్పి తీరాలి'' అని అన్నది.

జాయపుని ఊహలకు ఆమె అందడంలేదు. తన మనసులో ప్రశ్నలను, భావాలను గుర్తించినట్లే జవాబిస్తున్నది. ముఖంలోని ప్రశ్నలకు వివరంగా జవాబులు చెబుతున్నది.

ప్రధానమందిరం లోపలికి కుడికాలు పెట్టిన జాయపునికి మతిపోయింది. అదొక స్వప్నసౌధం.

ఇంద్రుని శృంగారవాటిక లాంటి ప్రధానమందిరం..

అది ఉదయవేళ కావడాన నిద్రిస్తున్న ఊర్వశిలా ప్రశాంతంగా కనిపించింది జాయపునికి. అద్భుతమైన